క్లుప్తంగా

పోలింగ్ కేంద్రాల పరిశీలన


రాజాపురం పాఠశాలను పరిశీలిస్తున్న తహసీల్దార్ నాగరాజు

పాల్వంచరూరల్: మండలంలోని యానంబైల్, రాజాపురం, పునుకుల గ్రామాల్లో పోలింగ్ కేంద్రాల ఏర్పాటు చేయనున్న పాఠశాలలను శనివారం తహసీల్దార్ సీహెచ్ నాగరాజు, డీటీ వినయ్ శీలాశ్రీరాం పరిశీలించారు. అనంతరం పునుకుల గ్రామంలో గతంలో 34మందికి మంజూరు చేసిన సోషల్ వెల్ఫేర్ పట్టాలను జలవనరులశాఖ ఈఈ బి.అర్జున్‌తో కలిసి పరిశీలించారు. తహసీల్దార్ మాట్లాడుతూ.. ఈ మండలంలో 60 లోకేషన్ల పరిధిలో 33 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయడం జరుగుతుందని ఆయా పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు అవసరమైన సౌకర్యాలను పరిశీలించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ హచ్యా పాల్గొన్నారు.

ఈవీఎంలపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఇల్లెందురూరల్: మండలంలోని పలు గ్రామ పంచాయతీలలో శనివారం ఈవీఎంలలో ఓటు ఎలా వేయాలో ప్రయోగాత్మకంగా ప్రజలకు అవగాహన కల్పించారు. గ్రామ కూడళ్లలో ప్రత్యేకంగా ఈవీఎంలను ప్రదర్శించి వాటి పనితీరును వివరించారు. ఈవీఎంలపై గుర్తులు ఎక్కడ ఉంటాయి.. పోటీలో ఉన్న అభ్యర్థుల పేర్లు ఎక్కడ ఉంటాయి.. ఎంచుకున్న వారికి ఓటు వేయాలంటే ఏం చేయాలి అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ బాలరాజు, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఆస్పత్రిలో పండ్లు పంపిణీ


పండ్లు పంపిణీ చేస్తున్న డాక్టర్ వెంకటేశ్వర్లు, ఫొటోగ్రాఫర్లు

జూలూరుపాడు: ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని శనివారం జూలూరుపాడులో మండల ఫొటో అండ్ వీడియో గ్రాఫర్ల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వాస్పత్రిలో రోగులకు మెడికల్ ఆఫీసర్స్ డాక్టర్ వెంకటేశ్వర్లు, డాక్టర్ ప్రదీప్తి పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఫొటో అండ్ వీడియో గ్రాఫర్ల సంఘం మండల అధ్యక్షుడు సవడం వెంకటేశ్వర్లు, ఎస్కె మన్సూర్ అలీ, సత్యనారాయణ, ఎస్కె బబ్లూ, సాంబ, అచ్యుత్, వెంకట్, రామాచారి, ఎస్కె సమీర్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ ముట్టడిని జయప్రదం చేయండి


మాట్లాడుతున్న అభిమిత్ర

సుజాతనగర్: విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 21న నిర్వహించనున్న చలో కలెక్టరేట్‌ను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బోడా అభిమిత్ర పిలుపునిచ్చారు. ఆ సంఘం ఆధ్వర్యంలో సుజాతనగర్‌లో శనివారం జరిగిన సమావేశంలో మాట్లాడుతూ.. పాఠశాలలు ప్రారంభమై నెలలు గడుస్తున్నా ఇంతవరకు పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్స్ పూర్తిస్థాయిలో అందలేదన్నారు. పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం, గురుకులాల్లో నాణ్యమైన భోజనం అందించడం లేదని, కాస్మొటిక్ చార్జీలు కూడా ఇవ్వడం లేదన్నారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్పులు విడుదల చేయాలని, కేజీ నుంచి పీజీ విద్య అందించాలని తదితర విద్యారంగ సమస్యల సాధన కోసం చేపడుతున్న కలెక్టరేట్ ముట్టడిని జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో పవన్, శివ, వంశీ, నవీన్, సాయి, గణేష్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ఉపాధ్యక్షుడిగా రవి

కొత్తగూడెంరూరల్: లక్ష్మీదేవిపల్లి మండల బీఆర్ఎస్ ఉపాధ్యక్షుడిగా నూనావత్ రవిని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు మండల అధ్యక్షుడు కొట్టి వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ సందర్భంగా రవిని ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు అభినందించారు.

సమస్యలతో సతమతం

- కనీస సౌకర్యాలు కరువు
- ఇబ్బంది పడుతున్న ఎర్రబోరు గ్రామం గిరిజనులు

పాల్వంచరూరల్: ఎర్రబోరు గిరిజనులు పలు సమస్యలతో సతమతమవుతున్నారు. ఆధార్, రేషన్, ఓటర్ గుర్తింపు కార్డులు అడిగిన వెంటనే ఇచ్చారు. కానీ విద్యుత్ , తాగునీటి సౌకర్యం కల్పించడం లేదని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దంతలబోరు గ్రామపంచాయతీ శివారు ఏపీ సరిహద్దు గ్రామమైన ఎర్రబోరులో 40 గిరిజన కుటుంబాలు, వంద మంది వరకు జనాభా ఉన్నారు. 22 సంవత్సరాల క్రితం ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం నుంచి వలస వచ్చి పోడు సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. గ్రామంలో తాగునీటి కోసం ఒక బోరు ఉంది. మిషన్ భగీరథ పైపులైన్ రోడ్డు మీద రెండు మూడు రోజులకోసారి నీటిని సరఫరా చేయడంతో తాగునీటి కోసం తంటాలు పడుతున్నారు. విద్యుత్ సౌకర్యం లేక అంధకారంలో మగ్గుతున్నారు. చికటి పడితే భయంభయంగా గడుపుతున్నారు. గ్రామంలో విద్యుత్, పోల్స్ నిర్మాణం కోసం నాలుగేళ్ల క్రితం సర్వే చేశారు. ఆ తర్వాత ఎవరూ పట్టించుకోవడం లేదు. ఐటీడీఏ అధికారులు గతేడాది రెండు సోలార్ విద్యుత్ లైట్లను గ్రామం మధ్యలో ఏర్పాటు చేశారు. అయితే మరమ్మతులకు గురై లైట్లు వెలగడం లేదని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో అంతర్గత రోడ్లు గానీ, డ్రెయినేజీలు కాని లేకపోవడంతో పారిశుద్ధ్య లోపం తాండవిస్తోంది. వర్షాకాలంలో గ్రామంలో పలుచోట్ల వరద నీరు గుంతల్లో నిల్వ ఉండి దోమలు, ఈగలు పెరిగి ప్రజలు అంటువ్యాధుల బారిన పడుతున్నారు. కనీసం అంగన్‌వాడీ కేంద్రం కూడా లేకపోవడంతో గిరిజనుల పిల్లలు మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న గంగదేవిగుప్ప అంగన్‌వాడీ కేంద్రానికి నడుచుకుంటూ వెళ్లాల్సి వస్తోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామంలోని వీధుల్లో సోలార్ లైట్లను ఏర్పాటు చేయాలని గిరిజనులు కోరుతున్నారు.


ఎర్రబోరు గ్రామంలో నిల్వ ఉన్న వాననీరు

రోడ్డు ఉన్నా కాలినడకే...

మండల శివారు గ్రామమైన ఎర్రబోరు వరకు తారు రోడ్డు సౌకర్యం ఉంది. కానీ ఆటోలు గానీ ఇతర వాహనాలు గానీ అక్కడ వరకు వెళ్లవు. దీంతో గ్రామంలోని గిరిజనులు నిత్యావసరాల కోసం ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న దంతలబోరు గానీ, గంగదేవిగుప్ప గానీ కాలినడకన వెళ్లాల్సిందే.


పనిచేయని సోలార్ విద్యుత్ లైట్లు

విద్యుత్ సౌకర్యం కల్పించాలి



గ్రామం అడవిని అనుకుని ఉంది. విద్యుత్ సౌకర్యం లేక రాత్రి బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నాం. బయటకు వెళ్లాలంటే టార్చిలైట్లను వేసుకుని వెళ్తున్నాం. రెండుసోలార్ లైట్లు పనిచేయడం లేదు. విద్యుత్ సౌకర్యంకోసం గతంలో సర్వేచేశారు. తర్వాత పట్టించుకోలేదు. – ముంజ సురేష్

భగీరథ నీరు అందించండి



తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నాం. ఒక బోరు ఉన్నా సరిపోవడంలేదు. రోడ్డు మీద మిషన్ భగీరథ పైపులైన్ ఉంది. అక్కడ నుంచి గ్రామంలో ఇంటింటికి నల్లాను ఏర్పాటు చేయాలి.. దూరప్రాంతానికి వెళ్లి నీళ్లు తెచ్చుకుంటున్నాం. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించాలి. – మడకం ఉంగి

ప్రతిపాదనలు పంపిస్తాం



ఎర్రబోరు గ్రామంలో మౌలిక సౌకర్యాల ఏర్పాటు కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతాం. గ్రామంలో తాగునీరు, విద్యుత్ సౌకర్యం ఏర్పాటు సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యలను పరిష్కరిస్తాం. – బి.అప్పారావు, ఎంపీడీఓ

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత


పూజలు చేస్తున్న ఎమ్మెల్యే హరిప్రియ దంపతులు

టేకులపల్లి: ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని ఇల్లెందు ఎమ్మెల్యే బానోతు హరిప్రియ అన్నారు. ఈ మేరకు శనివారం టేకులపల్లి మండలం కోయగూడెం పంచాయతీ హనుమాతండాలో నిర్వహిస్తున్న బొడ్రాయి, పోతురాజు, ముత్యాలమ్మ, ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ వేడుకలకు హాజరై ప్రత్యేక పూజలు చేశారు. వేడుకలకు ఎమ్మెల్యే రూ.50,116, చీమల సత్యనారాయణ రూ.20,116 విరాళం ప్రకటించారు. అనంతరం మూడు తండాలో ఏర్పాటు చేసిన అమ్మ ప్యూరిఫైడ్ మినరల్ వాటర్ ప్లాంట్‌ని ప్రారంభించారు. దిండిగల రాజేందర్, ప్రియాంక, బాలకృష్ణ, బానోతు హరిసింగ్‌నాయక్, శ్రీనివాస్‌రాజు, వరప్రసాద్, బోడ బాబు, రామ, కిషన్, శివ పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణ పనులు ప్రారంభం..

టేకులపల్లి: రేగులతండా నుంచి దాసుతండా వరకు 2021–22 సీఎస్ఆర్ నిధులు రూ.2 కోట్లతో నిర్మించనున్న డివైడర్, సెంట్రల్ లైటింగ్, రోడ్డు విస్తరణ పనులకు శనివారం ఇల్లెందు ఎమ్మెల్యే బానోతు హరిప్రియ శంకుస్థాపన చేశారు. మొదటి విడతగా టేకులపల్లి సెంటర్ నుంచి రేగులతండా వరకు రూ.1.04 కోట్లతో డివైడర్, సెంట్రల్ లైటింగ్, రోడ్డు విస్తరణ చేపట్టారు. ఎంపీడీఓ కోట వీరబాబు, ఎంపీఓ గణేష్ గాంధీ తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతలు చేపట్టిన సూపరింటెండెంట్


శ్రీకాంత్

ఇల్లెందురూరల్: మండల పరిషత్ కార్యాలయ సూపరింటెండెంట్‌గా శ్రీకాంత్ శనివారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. సుదీర్ఘకాలంగా ఇల్లెందు మండల పరిషత్ కార్యాలయంలో సూపరింటెండెంట్ పోస్టు ఖాళీగా ఉంది. ఎట్టకేలకు గతంలో ఇక్కడే సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహించిన శ్రీకాంత్‌ను చంద్రగొండ నుంచి ఇల్లెందుకు బదిలీ చేశారు.

ఉచిత శిక్షణ తరగతులు


మాట్లాడుతున్న నిమ్మి ఆనంద్

ఇల్లెందు: సింగరేణి సేవా సమితి ఇల్లెందు ఏరియా వారి ఆధ్వర్యంలో ఉచిత వృత్తి శిక్షణ తరగతులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సేవా సమితి అధ్యక్షురాలు నిమ్మి ఆనంద్ తెలిపారు. శనివారం సమితి కార్యాలయంలో ఆమె మాట్లాడారు. 2023–24లో జేకే ఓసీ–5 విస్తరణ ప్రభావిత ప్రాంతాలు, కోయగూడెం ఓసీ ప్రభావిత ప్రాంతాల నిరుద్యోగ మహిళలకు ఇల్లెందు పరిసరాల ప్రాంత మహిళలకు టైలరింగ్, మగ్గం, బ్యూటీషియన్, కంప్యూటర్ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇప్పించనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల మహిళలు 31వ తేదీ లోపు సేవా సమితి కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని కోరారు. విజయ, సులక్షణ, ట్రైనర్లు విజయలక్ష్మి, సంధ్య, ఆశ, సుప్రియ, సాంబయ్య, కిశోర్ పాల్గొన్నారు.

సెంట్రల్ లైటింగ్ నిర్మాణ పనుల పరిశీలన


డివైడర్‌ను పరిశీలిస్తున్న ఈఈ శ్రీనివాసరావు

పాల్వంచరూరల్: సెంట్రల్ లైటింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని పంచాయతీరాజ్ శాఖ ఈఈ శ్రీనివాసరావు సంబంధిత అధికారులను ఆదేశించారు. రూ.2కోట్ల వ్యయంతో జగన్నాథపురం నుంచి మున్సిపాలిటీ పరిధిలోని బీసీయం జాతీయ రహదారిపై ఇందిరానగర్ కాలనీ వరకు మూడున్నర కిలోమీటర్లు సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేస్తున్నారు. సీఎస్ఆర్ పాలసీ కింద మార్చిలో నిధులు మంజూరు కాగా నిర్మాణ పనులు జరుగుతున్నాయి. శనివారం పంచాయతీరాజ్ శాఖ ఈఈ లక్ష్మీదేవిపల్లి, పెద్దమ్మగుడి వద్ద పనులను పరిశీలించారు. కార్యక్రమంలో డీఈ సత్యనారాయణ, ఏఈ అనిల్‌కుమార్, కాంట్రాక్టర్ శ్రీనివాసరెడ్డి ఉన్నారు.

‘గృహలక్ష్మి’ వర్తింపజేయండి

సుజాతనగర్: 2 ఇంక్‌లైన్ గ్రామ పంచాయతీకి గృహలక్ష్మి పథకాన్ని వర్తింపజేయాలని కోరుతూ సర్పంచ్ గుగులోత్ నగేష్ ఆధ్వర్యంలో తహసీల్దార్ జి.శిరీష, ఎంపీడీఓ టి.వెంకటలక్ష్మికి శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. 2 ఇంక్లైన్ గ్రామ పంచాయతీ పరిధిలో వేలాది మంది పేదలు కిరాయి ఇళ్లలో నివసిస్తున్నారని తెలిపారు. ఈ క్రమంలో గృహలక్ష్మి పథకం ద్వారా సొంతింటి కల నెరవేరుతుందనే ఆశతో చాలామంది పేదలు దరఖాస్తు చేసుకున్నట్లు చెప్పారు. గ్రామం 1/70 యాక్ట్‌లో ఉందని అధికారులు చెబుతుండటంతో దరఖాస్తుదారులు అయోమయానికి గురవుతున్నట్లు తెలిపారు. గతంలో ఇందిరమ్మ పథకంలో గృహాలు మంజూరు చేసిన విధంగా గృహలక్ష్మి పథకం కూడా వర్తింపజేయాలని కోరారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ సింగిరాల రమేష్ తదితరులు పాల్గొన్నారు.


తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న నగేష్, రమేష్

అన్ని సంఘాలను సమానంగా చూడాలి


కేటీసీ మేనేజర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

టేకులపల్లి: సింగరేణిలో గుర్తింపు సంఘాల కాలపరిమితి ముగిసినందున అధికారులు అన్ని సంఘాలను సమానంగా చూడాలని గోదావరిలోయ బొగ్గు గని కార్మిక సంఘం (ఐఎఫ్‌టీయూ) సెంట్రల్ ప్రధాన కార్యదర్శి జే.సీతారామయ్య డిమాండ్ చేశారు. మండలంలోని కేటీసీలో శనివారం బయ్యా వరప్రసాద్ అధ్యక్షతన జరిగిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. ఎన్నికలు జరగకుండా ఉద్దేశ్యపూర్వకంగా యాజమాన్యం అడ్డుకున్నందున అన్ని సంఘాలను గుర్తించి చర్చల్లో భాగస్వామ్యం చేయాలన్నారు. అలాగే వేతన ఒప్పందం ఎరియర్స్ ఆగస్టు వేతనంతో చెల్లించాలని, లాభాల వాటా కూడా వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఆ తర్వాత కేటీసీ మేనేజర్‌కు సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ధరావత్ సక్రు, ఎండీ రాసుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతులు కల్పించండి

సుజాతనగర్: సుజాతనగర్ గ్రామ పంచాయతీలోని అంబేడ్కర్‌నగర్‌లో మౌలిక సౌకర్యాలు కల్పించాలని కోరుతూ ఆ గ్రామస్తులు శనివారం ప్లకార్డులతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా గ్రామ అభివృద్ధిలో అంబేడ్కర్‌నగర్‌కు చోటు లేదా..?ప్రజాప్రతినిధులు.. అధికారులు మా గోడు వినండి.. ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభాలను సరిచేయాలంటూ ప్లకార్డులను ప్రదర్శించారు. వేల్పుల భాస్కర్ మాట్లాడుతూ.. గ్రామంలో ఎప్పటి నుంచో రోడ్లు, డ్రెయినేజీ, విద్యుత్ స్తంభాల సమస్యలు ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. విద్యుత్ స్తంభాల వైర్లు చాలా కిందకు ఉండటం వలన ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. డ్రెయినేజీలు లేకపోవడంతో వర్షపు నీరు ఇళ్లలోకి చేరి నిల్వ ఉంటోందని, విషజ్వరాల బారిన పడుతున్నామన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కేసుపాక వెంకటేశ్వర్లు, గద్దల దుర్గారావు, దంసలపూడి పవన్, రాజు, చంటి, శ్రీను, హమీద్, పవన్, ఉదయ్, సాయి, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.


బురదమయమైన వీధిలో స్థానికులు

బాధ్యతలు చేపట్టిన రైతు సమితి కన్వీనర్లు

సూపర్‌బజార్(కొత్తగూడెం): లక్ష్మీదేవిపల్లి మండల రైతు సమన్వయ సమితి కన్వీనర్‌గా వట్టికొండ సాంబశివరావు, సుజాతనగర్ కన్వీనర్‌గా పెద్దమళ్ల నరేందర్ కొత్తగూడెం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు సమక్షంలో బాధ్యతలు స్వీకరించారు. మొదట ర్యాలీ నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రైతులకు సేవ చేయడంలో బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. కేసీఆర్‌ను మూడోసారి ముఖ్యమంత్రిని చేసేందుకు సమష్టి కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్‌రావు, మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి, ఎంపీపీలు బాదావత్ శాంతి, మార్కెట్ కమిటీ చైర్మన్ రాంబాబు, సొసైటీ చైర్మన్ మండే హనుమంతరావు, ఆత్మకమిటీ చైర్మన్ బత్తుల వీరయ్య, బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.


ర్యాలీలో ఎమ్మెల్యే వనమా, రైతు సమన్వయ సమితి కన్వీనర్లు

బాడీ లారీలకు బొగ్గు లోడింగ్ ఇవ్వండి


జీఎం జాన్‌ఆనంద్‌కు వినతిపత్రం అందజేస్తున్న లారీ యజమానులు

ఇల్లెందు: ఇల్లెందులో బాడీ లారీలకు బొగ్గు లోడింగ్ ఇవ్వకపోవటం వల్ల లారీ యజమానులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, తక్షణం బొగ్గు యాక్షన్‌లో పెట్టి బాడీ లారీలకు బొగ్గు కేటాయించాలని ఇల్లెందు బాడీ లారీ అసోసియేషన్ డిమాండ్ చేసింది. లారీ అసోసియేషన్ నేతలు బొడ్డుపల్లి సతీష్, పాయం వెంకన్నల ఆధ్వర్యంలో శనివారం జీఎం జాన్‌ఆనంద్‌కు వినతిపత్రం అందజేశారు. మాట్లాడుతూ.. బొగ్గు లోడింగ్ లేకపోవటం వల్ల బాడీ లారీ యజమానుల కుటుంబాలు గడవడం కష్టంగా ఉందన్నారు. మూడు నెలలుగా బాడీ లారీలకు బొగ్గు ఇవ్వటం లేదన్నారు. దీనివల్ల లారీ యజమానులు ఫైనాన్స్, ట్యాక్స్‌లు కట్టలేకపోతున్నట్లు చెప్పారు. లారీల మీద ఆధారపడిన లారీ యజమానులు, డ్రైవర్లు, క్లీనర్లు జీవించటం కష్టంగా మారిందన్నారు. సుమారు 600 కుటుంబాలు రోడ్డున పడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. స్పందించిన జీఎం పది రోజుల్లో యాక్షన్ పూర్తి చేసి లోడింగ్ ఇచ్చేందుకు ఏర్పాట్లు చేస్తామన్నారు. కార్యక్రమంలో యాకుబ్‌షావలీ, దుద్దు, సుభానీ, నూరుద్దీన్, పవన్, గౌస్, వెంకటేశ్వర్లు, సదా, వేముల శ్రీను, మురళీ తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య సమస్య పరిష్కరించండి

సుజాతనగర్: రాఘవాపురం గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదురు వీధిలో నెలకొన్న పారిశుద్ధ్య సమస్యను పరిష్కరించాలని కోరుతూ ఆ గ్రామస్తులు ఎంపీడీఓ వెంకటలక్ష్మికి శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ.. గతంలో రోడ్డు వేసిన సమయంలో రహదారి కింద వేసిన సిమెంటు పైపులు చిన్నవి కావడంతో పైనుంచి వచ్చిన వరద రోజుల తరబడి నిలిచిపోతోందన్నారు. పారిశుద్ధ్య లోపించిన కారణంగా దోమలు వృద్ధి చెంది విషజ్వరాల బారిన పడుతున్నట్లు చెప్పారు. సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని విజ్ఞప్తి చేశారు. ఆర్అండ్‌బీ అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని ఈ మేరకు ఎంపీడీఓ తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్తులు లోశెట్టి నాగార్జున్, కలవాల నాగయ్య, అనిల్ తదితరులు పాల్గొన్నారు.


వినతిపత్రం ఇస్తున్న రాఘవాపురం గ్రామస్తులు

చర్చల పేరుతో కాలయాపన


మాట్లాడుతున్న ముత్యాల విశ్వనాథం

సూపర్‌బజార్(కొత్తగూడెం): రెండో ఏఎన్ఎంల క్రమబద్ధీకరణపై స్పష్టత ఇవ్వకుండా చర్చల పేరుతో ప్రభుత్వం కాలయాపన చేస్తోందని సీపీఐ రాష్ట్ర నాయకుడు ముత్యాల విశ్వనాథం ధ్వజమెత్తారు. కలెక్టరేట్ వద్ద రెండో ఏఎన్ఎంల సమ్మె నిరసన దీక్షా శిబిరాన్ని శనివారం ఆయన సందర్శించి సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రెండుసార్లు యూనియన్, ఉద్యోగ ప్రతినిధులతో చర్చలు జరిపిన రాష్ట్ర హెల్త్ డైరెక్టర్ క్రమబద్ధీకరణ డిమాండ్‌పై స్పష్టత ఇవ్వలేదని విమర్శించారు.

ఇతర అంశాలపై కూడా ఎలాంటి స్పందన లేదని, కేవలం సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని మాత్రమే చెప్పడం సరికాదన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న ప్రస్తుత తరుణంలో రెండో ఏఎన్ఎంల సేవలు ఎంతో అవసరం ఉందన్నారు. న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి నరాటి ప్రసాద్, అన్నారపు వెంకటేశ్వర్లు, నరహరి నాగేశ్వరరావు, ఎండీ సజ్జుబేగం, బానోత్ ప్రియాంక, కౌసల్య, అరుణ, రాములమ్మ, పార్వతి, పుష్ప, బాలనాగమ్మ, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి ఉత్తర్వులు బేఖాతరు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి ఉన్నతాధికారులు, ఉద్యోగులు ఇంధన పొదుపు పాటించాలని ప్రతి శనివారం తమ కార్లు, బైక్‌ల్లో కాకుండా సైకిల్‌పై లేదా కాలినడకన విధులకు హాజరు కావాలని యాజమాన్యం ఉత్తర్వులు జారీ చేసింది. అట్టి ఉత్తర్వులను విస్మరించారని పలువురు కార్మికులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. శనివారం సింగరేణి ప్రధాన కార్యాలయంలో పనిచేసే 98 శాతం మంది అధికారులు, ఉద్యోగులు కార్లు, ద్విచక్రవాహనాల్లోనే వచ్చారని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు వారంలో ఒక్కరోజైనా ఇంధన పొదుపు పాటించాలని పలువురు ఉద్యోగులు కోరుతున్నారు.


సింగరేణి ప్రధాన కార్యాలయంలో పార్కింగ్ చేసిన కార్లు

ప్రజాస్వామ్య విలువలు కాపాడుదాం..


5 కే రన్‌లో అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు

ఇల్లెందు: ప్రజాస్వామిక పరిరక్షణ కోసం ఓటును ఆయుధంగా మలుచుకోవాలని డీఎస్పీ ఎస్వీ రమణమూర్తి, తహసీల్దార్ కె.రవికుమార్, సీఐ కరుణాకర్, కమిషనర్ కుమారస్వామి, ఎంపీడీఓ బాలరాజు అన్నారు. శనివారం నూతన ఓటర్ల నమోదు, ఓటు హక్కు వినియోగం, ఓటు ప్రాధాన్యతపై భారత ఎన్నికల సంఘం ఆదేశాల ప్రకారం 5కే రన్ నిర్వహించారు. తొలుత గోవింద్ సెంటర్ నుంచి జగదాంబా సెంటర్ మీదుగా కరెంటాఫీస్ వరకు చేపట్టిన 5కే రన్‌లో అన్ని శాఖల అధికారులు, ఉద్యోగులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు, పోలీసులు, పాల్గొన్నారు. డీఎస్పీ మాట్లాడుతూ... ప్రతీపౌరుడు ప్రజాస్వామ్యం మీద నమ్మకంతో విలువలతో కూడిన జీవనం సాగించాలని అందుకు ఓటు హక్కును ఉపయోగించుకోవాలని కోరారు. 18 ఏళ్లు నిండిన యువత ఓటుకు అర్హులని, ఓటు నమోదు చేసుకుని అన్ని ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకోవాలని కోరారు. ఓటరు సవరణ ఫారం 6 ద్వారా నూతన ఓటరు నమోదు, ఫారం 8 ద్వారా ఓటరు జాబితాలో చిరునామా పోలింగ్ కేంద్రాల మార్పులు, చేర్పులు చేసుకోవడానికి అవకాశం ఉందన్నారు. కళాశాలల యాజమాన్యాలు 18 ఏళ్లు నిండిన విద్యార్థులను ఓటరుగా నమోదు చేయించాలని, పోలింగ్ ప్రక్రియ మీద అవగాహన కల్పించాలని కోరారు. అధికారులు, కళాశాలల ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు, టీచర్లు, అంగన్‌వాడీ టీచర్లు, మున్సిపల్, మెప్మా సిబ్బంది, ఆర్పీలు, వివిధ రాజకీయ పార్టీల నేతలు, విద్యార్థులు పాల్గొన్నారు.